


> ఇంటెరిమ్ బడ్జెట్‌కు 10 కి 10 మార్కులు వేస్తున్నాను. పాలసీలు, ట్యాక్స్ విధానాలను కొనసాగిస్తూనే గ్రోత్, వెల్ఫేర్, ఫిస్కల్ డెఫిసిట్ తగ్గించడం వంటి అంశాలపై ఫోకస్ పెట్టింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై ఖర్చులు పెంచడం ద్వారా జాబ్స్‌ను ప్రభుత్వం క్రియేట్ చేస్తోంది. అదే టైమ్‌లో పేదవారు, రైతులు, మహిళలు, యువ తకు ప్రయారిటీ ఇచ్చింది. ఫిస్కల్ డెఫిసిట్ 2024–25 లో జీడీపీలో 5.1 శాతానికి, 2025–26 లో జీడీపీలో 4.5 శాతానికి దిగొస్తుందని అంచనా వేసింది.
> **- ఆశిష్‌కుమార్ చౌహాన్, ఎన్‌ఎస్‌ఈ సీఈఓ**



> ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ట్యాక్స్ కలెక్షన్స్ పెరగడం ఆనందించదగ్గ అంశం. కరోనా ఏడాది మినహా గత ఏడేళ్లలో ఇదే ఎక్కువ. పేదవారు, ఎంటర్‌ప్రెనూర్లు, అగ్రిప్రెనూర్లు, మహిళలకు మేలు చేసేలా ఇంటెరిమ్ బడ్జెట్ ఓ మార్గాన్ని క్రియేట్ చేసింది.
> **- దినేష్ కుమార్ ఖారా, ఎస్‌బీఐ చైర్మన్**



> ఇంటెరిమ్ బడ్జెట్‌పై హ్యాపీగా ఉన్నాను. మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను వాడుకొని యువతను స్కిల్డ్ మ్యాన్‌పవర్‌గా మార్చాలని ప్రభుత్వం చూడడం ఆహ్వానించదగ్గ విషయం. దీంతో మెడికల్, నర్సింగ్ కాలేజీలు పెరుగుతాయి. ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ కోసం రూ.లక్ష కోట్ల ఫండ్‌ను ఏర్పాటు చేయడంతో ప్రైవేట్ కంపెనీలు రీసెర్చ్‌పై ఫోకస్ పెంచుతాయి.
> **- ప్రతాప్ సీ రెడ్డి, అపోలో హాస్పిటల్స్ చైర్మన్**





పన్నులకు పాత పద్ధతే

గత ఆర్థిక సంవత్సరం మాదిరే స్లాబ్స్ ■ వేతన జీవులను నిరాశపర్చిన బడ్జెట్

న్యూఢిల్లీ: బడ్జెట్ రోజు శాలరీడ్ క్లాస్ ఆశగా ఎదురుచూసేది ఆదాయపు పన్ను రాయితీ కోసమే! ఈసారి వారికి నిరాశే ఎదురయింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ 2024లో కొత్త, పాత ఆదాయపు పన్ను విధానాలకు పన్ను స్లాబ్ రేట్లను యథాతథంగా ఉంచారు. అంటే గత ఆర్థిక సంవత్సరం పన్ను విధానమే ఈసారి కూడా వర్తిస్తుంది. కొత్త విధానంలో రూ.ఏడు లక్షల వరకు పన్ను ఉండదు. కార్పొరేట్ పన్నులను, కస్టమ్స్ సుంకాలను కూడా మార్చలేదు. పన్నులకు సంబంధించి ఎటువంటి మార్పులనూ ప్రతిపాదించడం లేదని, దిగుమతి సుంకాలతో సహా ప్రత్యక్ష పన్నులకు, పరోక్ష పన్నులకు గత పన్ను రేట్లే కొనసాగుతాయని తెలిపారు. మధ్యంతర బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయపు పన్ను స్లాబులు రేట్లతో సంబంధం లేకుండా ఆర్థిక మంత్రి తీసుకున్న నిర్ణయం అర్థం చేసుకోదగ్గదేనని, గ్లోబల్ మార్కెట్లలో సమస్యలు కొనసాగుతున్నందున, వృద్ధిని పెంపొందించడానికి ఇలా చేసి ఉండవచ్చని అక్యూబ్ వెంచర్స్ డైరెక్టర్ ఆశిష్ అగర్వాల్ అన్నారు. అయితే, ప్రధాన ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, మాంద్యం కారణంగా వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు కొంత ఉపశమనాన్ని ఆశించారు. "ముఖ్యంగా జీతం పొందే వాళ్లు చాలా రకాలుగా ఇబ్బందిపడుతున్నారు. జీతాలు పెరగడం లేదు. ఉద్యోగ మార్కెట్లో ఆటుపోట్లు ఉన్నాయి. ఖర్చులు చాలా పెరిగాయి. అధిక స్టాండర్డ్ డిడక్షన్, మెరుగైన హౌసింగ్ లోన్ వడ్డీ మినహాయింపులు లేదా 80సీలో మార్పులు వీరికి కొంత ఊరటను ఇచ్చేవి. ఇవేవీ లేవు కాబట్టి కొంత నిరాశ సహజమే'' అని ఆశిష్ అగర్వాల్ అన్నారు.



కొత్త పన్ను విధానం

1. రూ. 3 లక్షల వరకు ఆదాయానికి పన్ను ఉండదు
2. రూ.3-6 లక్షల మధ్య ఆదాయంపై 5 శాతం పన్ను విధిస్తారు. సెక్షన్ 87ఏ కింద పన్ను రాయితీ ఉంది
3. రూ.6-9 లక్షల మధ్య ఆదాయంపై 10 శాతం పన్ను విధిస్తారు. రూ.7 లక్షల వరకు ఆదాయంపై సెక్షన్ 87ఏ కింద పన్ను రాయితీ ఉంది
4. రూ.9-12 లక్షల మధ్య ఆదాయం ఉంటే 15 శాతం పన్ను చెల్లించాలి.
5. రూ.12-15 లక్షల మధ్య ఆదాయం గల వాళ్లు 20 శాతం పన్ను భరించాలి.
6. రూ.15 లక్షలు అంతకంటే ఎక్కువ ఆదాయం ఉంటే 30 శాతం పన్ను విధిస్తారు. కొత్త పన్ను విధానంలో పన్ను రేట్లు అన్ని వర్గాల వ్యక్తులకు, అంటే వ్యక్తులు, సీనియర్ సిటిజన్లు సూపర్ సీనియర్ సిటిజన్‌లకు ఒకే విధంగా ఉంటాయి.

పాత పన్ను విధానం

1. రూ.2.5 లక్షల వరకు ఆదాయం ఉన్న వాళ్లు పన్ను కట్టాల్సిన అవసరం లేదు.
2. రూ.2.5 నుంచి రూ.5 లక్షల మధ్య ఆదాయం ఉంటే పాత పన్ను విధానంలో 5 శాతం చొప్పున పన్ను విధిస్తారు.
3. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వ్యక్తిగత ఆదాయంపై 20 శాతం పన్ను విధిస్తారు.
4. రూ.10 లక్షలకు పైబడిన వ్యక్తిగత ఆదాయంపై 30 శాతం పన్ను విధిస్తారు. పాత పన్ను విధానంలో, ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి 60 ఏళ్లు పైబడిన 80 ఏళ్లలోపు ఉన్న వయసున్న సీనియర్ సిటిజన్‌లకు రూ. 3 లక్షల వరకు ఉంటుంది. అయితే 80 ఏళ్లు పైబడిన సూపర్ సీనియర్ సిటిజన్‌లకు రూ.5 లక్షల వరకు ఉంటుంది. ఈసారి పన్నుభారాన్ని కొంతైనా తగ్గిస్తారని మధ్యతరతగతి జనం భావించింది కానీ ప్రభుత్వం మాత్రం రేట్లను ఎప్పట్లాగే ఉంచింది.

గత పదేళ్లలో ఎంతో సాధించాం

- ఎకానమీ బలపడింది
- మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: గడచిన పదేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ ఎంతో దూసుకెళ్లిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం చెప్పారు. భారతదేశ ప్రజలు భవిష్యత్తు కోసం ఆశతో ఎదురు చూస్తున్నారని అన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల కోసం ఎన్నో చర్యలను తీసుకుందని అన్నారు. నిర్మాణాత్మక మార్పులు, ప్రజానుకూల కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలు ఆర్థిక వ్యవస్థకు ఎంతో శక్తిని అందించాయని ఆర్థిక మంత్రి చెప్పారు. 2020-21లో జీడీపీ 5.8 శాతం తగ్గిన తర్వాత, 2021-22లో ఆర్థిక వ్యవస్థ 9.1 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ తన తాజా నెలవారీ ఆర్థిక సమీక్షలో భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత 3.7 ట్రిలియన్ డాలర్ల నుంచి 5 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో వచ్చే మూడేళ్లలో ప్రపంచంలో మూడవ అతిపెద్దదిగా అవతరించనుందని పేర్కొంది. వచ్చే ఆరు నుంచి ఏడేళ్లలో 2030 నాటికి 7 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగగలదని కూడా పేర్కొంది. డిసెంబరులో, ఆర్‌బీఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 6.5 శాతం నుంచి 7 శాతానికి పెంచింది. దేశీయ డిమాండ్, తయారీ రంగంలో బలంగా ఉండటమే ఇందుకు కారణం. 2023-24, 2024-25 సంవత్సరాల్లో ఆర్థిక వృద్ధి 6.5 % వద్ద పటిష్టంగా ఉంటుందని ఐఎంఎఫ్ పేర్కొంది.



అప్పులు తగ్గించడం.. రెవెన్యూ పెంచడంపై ఫోకస్

2024–25 కి గాను ఫిస్కల్ డెఫిసిట్ అంచనాలు తగ్గించిన ప్రభుత్వం

- జీడీపీలో 5.1 శాతం ఉంటుందని అంచనా
- జీడీపీలో 4.5 శాతానికి తగ్గించడమే టార్గెట్

న్యూఢిల్లీ: ఓటర్లను ఆకర్షించడానికి ఇంటెరిమ్ బడ్జెట్‌లో పెద్దగా స్కీమ్‌లు ప్రకటించనప్పటికీ, ప్రభుత్వం మాత్రం ఫిస్కల్ డెఫిసిట్ పై ఎక్కువ ఫోకస్ పెట్టింది. ఫిస్కల్ డెఫిసిట్ (ప్రభుత్వ ఖర్చులు, రెవెన్యూ మధ్య తేడా. అప్పులు మినహాయించి) టార్గెట్‌ను వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను తగ్గించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఫిస్కల్ డెఫిసిట్ జీడీపీలో 5.8 శాతంగా రికార్డవుతుందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. గతంలో వేసిన అంచనా జీడీపీలో 5.9 శాతం నుంచి తగ్గించారు. అంతేకాకుండా 2024-25 ఆర్థిక సంవత్సరంలో మరింత తగ్గుతుందని, జీడీపీలో 5.1 శాతానికి దిగొస్తుందని వెల్లడించారు. '2021-22 బడ్జెట్ స్పీచ్‌లో చెప్పినట్టు 2025-26 నాటికి ఫిస్కల్ డెఫిసిట్‌ను జీడీపీలో 4.5 శాతం దిగువకు తీసుకురావడంపై పనిచేస్తున్నాం. ఇందులో భాగంగానే 2024-25 లో ఫిస్కల్ డెఫిసిట్ జీడీపీలో 5.1 శాతానికి తగ్గుతుందని అంచనా వేస్తున్నాం' అని తన బడ్జెట్ స్పీచ్‌లో నిర్మల అన్నారు. ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరంలో నామినల్ జీడీపీ గ్రోత్ 10.5 శాతంగా రికార్డవుతుందని అంచనా వేస్తోంది. 'అనుకున్న దాని కంటే క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ నెంబర్లు ఎక్కువగా ఉండడం, ఫిస్కల్ డెఫిసిట్ టార్గెట్‌ను తగ్గించడం చూస్తుంటే 2023-24, 2024-25 లో ప్రభుత్వ ఖర్చులు జాగ్రత్తగా జరుగుతాయని తెలుస్తోంది' అని ఇక్రా చీఫ్ ఎకనామిస్ట్ అదితి నాయర్ పేర్కొన్నారు. ఓటర్లను ఆకర్షించే చాలా మాటలు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ, అప్పులు తగ్గించడానికి, ఫిస్కల్ డెఫిసిట్‌ను కంట్రోల్‌లో ఉంచడానికి ప్రభుత్వం ప్రయారిటీ ఇచ్చిందని నోమురా చీఫ్ ఎకనామిస్ట్ సోనల్ వర్మ పేర్కొన్నారు. గత రెండు మూడేళ్లుగా ప్రైవేట్ కంపెనీల క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ తక్కువగా ఉందని, అందుకే ప్రభుత్వం క్యాపెక్స్‌ను పెంచిందని అన్నారు. ఇక ప్రైవేట్ క్యాపెక్స్ పుంజుకునే అవకాశం ఉండడంతో ప్రభుత్వం తన క్యాపెక్స్‌ను తగ్గించొచ్చని అంచనా వేశారు. కాగా, ట్యాక్స్ రెవెన్యూ పెరగడంతో ఫిస్కల్ డెఫిసిట్ దిగొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 38.3 లక్షల కోట్ల గ్రాస్ ట్యాక్స్ రెవెన్యూ వస్తుందని అంచనా. ఇది ఇయర్ ఆన్ ఇయర్ ప్రకారం 11.6 శాతం వృద్ధికి సమానం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.34.37 లక్షల కోట్ల ట్యాక్స్ రెవెన్యూ వస్తుందని గతంలో అంచనా వేశారు.

గత 10 ఏళ్లలో రూ.50 లక్షల కోట్ల విదేశీ ఇన్వెస్ట్‌మెంట్లు

విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని, ఇందుకోసం వివిధ దేశాలతో బైలేటరల్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రీటీస్ (బిట్స్) ను కుదుర్చుకుంటోందని నిర్మలా సీతారామన్ అన్నారు. 2014-2023 మధ్య 596 బిలియన్ డాలర్ల (రూ.50 లక్షల కోట్ల) ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్లు (ఎఫ్‌డీఐ) వచ్చాయని, ఇది 2005-2014 మధ్య వచ్చిన ఎఫ్‌డీఐల కంటే డబుల్ అని వెల్లడించారు. యూకే వంటి దేశాలతో ఇండియా ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. మూడో అతిపెద్ద ఎకానమీగా ఇండియా ఎదగాలని చూస్తోందని, గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ విధానాలకు తగ్గట్టు తన విధానాలను మార్చుకోవాల్సి ఉంటుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ వెల్లడించింది. తనకు అనుకూలంగా లేకపోవడంతో 2016 నాటికి 80 బిట్స్‌లలో ఇండియా 77 రద్దు చేసిందని గుర్తు చేసింది. ప్రస్తుతం 37 దేశాలతో మళ్లీ చర్చలు మొదలు పెట్టింది. కాగా, కిందటేడాది ఏప్రిల్ - సెప్టెంబర్ మధ్య దేశంలోకి 20.48 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయి. జియో పొలిటికల్ టెన్షన్ల కారణంగా తగ్గాయి. సింగపూర్, మారిషస్, యూకే, యూఎస్, యూఏఈ దేశాలు ఇండియాలో ఎక్కువగా ఇన్వెస్ట్ చేస్తున్నాయి.



ట్యాక్స్ డిమాండ్‌లు వెనక్కి

- బకాయిలను రద్దు చేసిన ప్రభుత్వం
- కోటి మంది ట్యాక్స్ పేయర్లకు ఉపశమనం

న్యూఢిల్లీ: బడ్జెట్‌లో ఇన్‌కమ్ ట్యాక్స్‌కు సంబంధించి ఎటువంటి మార్పులు చేయలేదు. కానీ, చిన్న చిన్న కారణాల వలన డైరెక్ట్ ట్యాక్స్ డిమాండ్ నోటీసులు అందుకున్నవారికి మాత్రం ప్రభుత్వం ఊరటనిచ్చింది. మార్చి, 2010 కంటే ముందు అందుకున్న ట్యాక్స్ డిమాండ్ నోటీసులను కేంద్రం రద్దు చేయనుంది. రూ.25 వేల లోపు ఉన్న ట్యాక్స్ డిమాండ్ నోటీసులకు ఇది వర్తిస్తుంది. అధికారులు ఇటువంటి డిమాండ్ నోటీసులను ఇక నుంచి పట్టించుకోరు. అలానే ఏప్రిల్, 2011 నుంచి మార్చి ,2015 మధ్య రూ.10 వేలు లేదా అంత కంటే తక్కువ ట్యాక్స్ అమౌంట్ కోసం డిమాండ్ నోటీసులు అందుకున్న వారికి కూడా ప్రభుత్వం ఊరట కలిపించింది. ఇటువంటి ట్యాక్స్ డిమాండ్స్‌కు స్పందించక, బకాయి పడిన వారిని అధికారులు ఇక నుంచి పట్టించుకోరు. ట్యాక్స్ డిమాండ్ బకాయిలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవడంతో సుమారు కోటి మంది ట్యాక్స్‌పేయర్లకు మేలు జరుగుతుందని నిర్మలా సీతారామన్ అన్నారు. కోటి మందికి ఇచ్చిన ట్యాక్స్ డిమాండ్ నోటీసులను వెనక్కి తీసుకుంటున్నట్టు బడ్జెట్ స్పీచ్‌లో పేర్కొన్నారు. 'వెరిఫై కాని, పరిష్కారానికి మార్గం లేని, అర్థం పర్థం లేని కారణాలతో ఏకంగా 1962 నాటి నుంచి అనేక ట్యాక్స్ వివాదాలు కొనసాగుతున్నాయి. నిజాయితీ పరులైన పన్ను చెల్లింపుదారులకు ఆందోళన కలిగిస్తున్నాయి' అని సీతారామన్ పేర్కొన్నారు. రీఫండ్స్ ఇవ్వడంలో అడ్డుగా మారాయని చెప్పారు. ప్రభుత్వం ఎంత చక్కగా డేటా బేస్‌ను వాడుకుంటుందో తెలియజేసే అంశమిదని ఎన్.ఏ షా అసోసియేట్స్ మేనేజింగ్ పార్టనర్ సందీప్ షా అన్నారు.

మార్కెట్లకు కొద్దిపాటి నష్టాలు

- సెన్సెక్స్107 పాయింట్లు డౌన్
- 28 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ



ముంబై: ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల నుంచి పెద్దగా ఎటువంటి ప్రకటనలు లేకపోవడంతో మార్కెట్లలో కొంత నిరుత్సాహం కనిపించింది. సెన్సెక్స్, నిఫ్టీ కొద్దిపాటి నష్టాలతో ముగిశాయి. ఇన్వెస్టర్లు క్యాపిటల్ గూడ్స్, మెటల్, రియల్టీ షేర్లలో ప్రాఫిట్ బుకింగ్ చేశారు. ప్రారంభ లాభాలను కోల్పోయిన తర్వాత, మధ్యంతర బడ్జెట్‌ను సమర్పించే సమయంలో మార్కెట్లు ఒడిదుడుకులకు గురయ్యాయి. బడ్జెట్‌లో మూలధన వ్యయం స్వల్పంగా పెరిగినా, పెద్ద ప్రకటనలు లేవు. సెన్సెక్స్ 107 పాయింట్లు క్షీణించి 71,645.30 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో గరిష్టంగా 72,151.02లకు చేరింది. నిఫ్టీ 28.25 పాయింట్లు క్షీణించి 21,697.45 వద్దకు చేరుకుంది. ఇంట్రాడేలో గరిష్ట స్థాయి 21,832.95 కనిష్ట స్థాయి 21,658.75 మధ్య ఊగిసలాడింది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ మార్చిలో వడ్డీ రేట్లను తగ్గించబోమని పేర్కొనడంతో మార్కెట్ సెంటిమెంట్ కూడా మందగించింది. వివాదాస్పద చిన్న పన్ను డిమాండ్ల నుండి సామాన్యులకు ఉపశమనం కలిగించే సంస్కరణలను కేంద్రం బడ్జెట్‌లో ప్రకటించింది. ఆర్థిక వృద్ధి రేటును కొనసాగించడానికి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం వచ్చే ఆర్థిక సంవత్సరానికి మూలధన వ్యయాన్ని 11 శాతం పెంచారు. కార్పొరేట్‌లకు ఆదాయపు పన్ను రేట్లు, కస్టమ్స్ డ్యూటీలో ఎటువంటి మార్పులను ప్రతిపాదించలేదు. 2024-25లో మూలధన వ్యయాన్ని రూ. 11.11 లక్షల కోట్లకు పెంచారు. ఈ ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక లోటును 5.8 శాతానికి తగ్గించారు. తదుపరి ఆర్థిక సంవత్సరంలో 5.1 శాతానికి తగ్గించారు.

సెన్సెక్స్ కంపెనీల పెర్ఫామెన్స్ ఇలా...

సెన్సెక్స్ సంస్థలలో, లార్సెన్ అండ్ టూబ్రో, అల్ట్రాటెక్ సిమెంట్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టైటాన్, బజాజ్ ఫైనాన్స్, విప్రో, టెక్ మహీంద్రా నెస్లే షేర్లు నష్టాలపాలయ్యాయి. మారుతీ, పవర్ గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్ లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ గేజ్ 0.40 శాతం క్షీణించగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.22 శాతం పడింది. సూచీలలో టెలికమ్యూనికేషన్ 1.55 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.12 శాతం, రియాల్టీ 1.05 శాతం, మెటల్ 0.99 శాతం, కమోడిటీలు 0.91 శాతం, ఇండస్ట్రియల్స్ 0.91 శాతం తగ్గాయి. ఎనర్జీ, ఎఫ్‌ఎంసీజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, యుటిలిటీస్ సర్వీసెస్ లాభపడిన వాటిలో ఉన్నాయి.



స్టార్టప్‌లకు బూస్ట్

- పన్ను ప్రయోజనాల పొడగింపు

న్యూఢిల్లీ: సావరిన్ వెల్త్ లేదా పెన్షన్ ఫండ్స్ ద్వారా స్టార్టప్‌లు పెడుతున్న ఇన్వెస్ట్‌మెంట్లపై పన్ను ప్రోత్సాహకాన్ని మరో ఏడాది.. అంటే మార్చి 2025 వరకు పొడిగించాలని ప్రభుత్వం గురువారం ప్రతిపాదించింది. పన్ను మినహాయింపు మార్చి 31, 2024తో ముగుస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ మినహాయింపులను మార్చి 31, 2025 వరకు పొడిగించాలని ప్రతిపాదిస్తున్నానని చెప్పారు. దేశంలో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని, ఇప్పటివరకు 1.17 లక్షల స్టార్టప్‌లను ప్రభుత్వం గుర్తించిందని ప్రకటించారు. అర్హత కలిగిన స్టార్టప్‌లు స్టార్టప్ ఇండియా కోసం యాక్షన్ ప్లాన్ కింద ఆదాయపు పన్ను ప్రయోజనాల వంటి పన్ను ప్రోత్సాహకాలను పొందవచ్చని చెప్పారు.

నెక్ గుడ్ల ధరలు	ఫామ్‌గేట్ (100కు)	డజన్
హైదరాబాద్	₹ 520	72
వరంగల్	₹ 522	72

సెన్సెక్స్ ↓ 107 — 71,645

నిఫ్టీ ↓ 28 — 21,697

బంగారం ధరలు (10గ్రాములు) హైదరాబాద్

₹ 63,440 (24 క్యారెట్లు)	₹ 58,150 (22 క్యారెట్లు)
₹ 47,580 (18 క్యారెట్లు)	

వెండి ధర (కేజీ) హైదరాబాద్: ₹ 77,800

ప్రభుత్వానికి ఆర్‌బీఐ నుంచి డబ్బే డబ్బు

- వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.1.04 లక్షల కోట్ల డివిడెండ్ వస్తుందని అంచనా



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ, ప్రభుత్వ ఫైనాన్షియల్ సంస్థల (బ్యాంకుల) నుంచి రూ.1.02 లక్షల కోట్ల డివిడెండ్ ఇన్‌కమ్ వస్తుందని బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 1.04 లక్షల కోట్ల డివిడెండ్ ఆదాయాన్ని ప్రభుత్వం పొందే అవకాశం ఉంది. ఇది కిందటేడాది బడ్జెట్‌లో వేసిన అంచనా రూ.48 వేల కోట్ల కంటే చాలా ఎక్కువ. కిందటేడాది మే లో ఆర్‌బీఐ ఏకంగా రూ.87,416 కోట్ల డివిడెండ్‌ను ప్రభుత్వానికి చెల్లించింది. సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ (సీపీఎస్ఈ) ల నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.43 వేల కోట్ల డివిడెండ్ ఆదాయం వస్తుందని బడ్జెట్ అంచనా వేసింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ, ప్రభుత్వ ఫైనాన్షియల్ సంస్థల నుంచి రూ.39,961 కోట్ల డివిడెండ్స్‌ను కేంద్రం అందుకుంది. మొత్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ఆర్‌బీఐ, ప్రభుత్వ బ్యాంకులు, ఇతర గవర్నమెంట్ కంపెనీల నుంచి కేంద్రానికి రూ. 1,54,407 కోట్ల డివిడెండ్ ఆదాయం వచ్చే అవకాశం ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.1.50 లక్షల కోట్లు అందుతుందని అంచనా.

మార్కెట్ నుంచి ఫండ్స్ సేకరణ..

సెక్యూరిటీల (లాంగ్ టెర్మ్ బాండ్ల) ను ఇష్యూ చేయడం ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.14.13 లక్షల కోట్లను ప్రభుత్వం సేకరిస్తుందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఫిస్కల్ డెఫిసిట్ (ఖర్చులు మైనస్ ఆదాయం) ను చేరుకోవడానికి డెట్ మార్కెట్ వైపు కేంద్రం చూస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జులై 31 నాటికి డేటెడ్ సెక్యూరిటీలను ఇష్యూ చేయడం ద్వారా కేంద్రం రూ.5.77 లక్షల కోట్ల గ్రాస్ అమౌంట్‌ను సేకరించింది.

గెలాక్సీ ఎస్ 24 సిరీస్ ఫోన్ల అమ్మకాలు షురూ

హైదరాబాద్, వెలుగు: శామ్‌సంగ్ ఇటీవల విడుదల చేసిన ఫ్లాగ్‌షిప్ గెలాక్సీ ఎస్ 24 సిరీస్ ఫోన్ల అమ్మకాలు గురువారం నుంచి మనదేశంలో మొదలయ్యాయి. 'మేడ్ ఇన్ ఇండియా' గెలాక్సీ ఎస్ 24 అల్ట్రా, గెలాక్సీ ఎస్ 24+ గెలాక్సీ ఎస్ 24 స్మార్ట్‌ఫోన్‌లు లైవ్ ట్రాన్స్‌లేట్, ఇంటర్‌ప్రెటర్, చాట్ అసిస్ట్, నోట్ అసిస్ట్ ట్రాన్స్‌స్క్రిప్ట్ అసిస్ట్ ఫీచర్లతో వస్తాయి. శామ్‌సంగ్ కీబోర్డ్‌లోని ఏఐ హిందీతో సహా 13 భాషల్లో రియల్‌టైంలో మెసేజ్‌లను అందిస్తుంది. గెలాక్సీ ఎస్ 24 సిరీస్ భారతదేశంలోని శామ్‌సంగ్ నోయిడా ఫ్యాక్టరీలో తయారవుతోంది. ఈ ఫోన్ల కోసం రికార్డ్ స్థాయిలో ప్రీబుకింగ్‌లను శామ్‌సంగ్ పొందింది. ధరలు రూ.80 వేల నుంచి రూ.1.60 లక్షల వరకు ఉంటాయి.



బిగ్‌సీ ద్వారా తెలుగు రాష్ట్రాల్లోకి..

మొబైల్స్ రిటైలర్ బిగ్‌సీ ద్వారా శామ్‌సంగ్ ఎస్24 సిరీస్ ఫోన్లను తెలుగు రాష్ట్రాల్లో అందుబాటులోకి తెచ్చింది. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ బాలు చౌదరి, డైరెక్టర్లు, సినీతార మృణాల్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సిరీస్‌ఫోన్లలో అధునాతమైన ఫీచర్లు ఉన్నారని, వీటిని తెలుగు రాష్ట్రాల్లో లాంచ్ చేయడానికి శామ్‌సంగ్ తమను ఎంపిక చేసుకుందని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో బిగ్ సీ నంబర్‌వన్ మొబైల్‌రిటైల్ చెయిన్‌గా మొదటిస్థానంలో ఉందని చౌదరి చెప్పారు. అంతర్జాతీయస్థాయిలో ప్రసిద్ధి చెందిన బ్రాండ్లు కూడా ప్రొడక్ట్ లాంచింగ్ కోసం బిగ్‌సీ ఎంచుకుంటాయని ఆయన వివరించారు.



పేటీఎంకు ఆర్‌బీఐ షాక్

- షేర్లు 20 శాతం క్రాష్



న్యూఢిల్లీ: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ డిపాజిట్లు సేకరించడంపై ఆర్‌బీఐ రిస్ట్రిక్షన్ల పెట్టడంతో పేటీఎం షేర్లు గురువారం 20 శాతం క్రాష్ అయ్యి లోవర్ సర్క్యూట్ టచ్ చేశాయి. రూ.609 దగ్గర ముగిశాయి. పేటీఎం ఫాస్టాగ్, వాలెట్లు వంటి వాటికి కస్టమర్లు మనీని ఫిబ్రవరి 29 నుంచి యాడ్ చేసుకోవడాన్ని ఆర్‌బీఐ నియంత్రించింది. దీంతో కంపెనీ ఆపరేషనల్ ప్రాఫిట్ ఏడాదికి రూ.300 - 500 కోట్ల తగ్గే ఛాన్స్ ఉందని ఎనలిస్టులు అంచనా వేస్తున్నారు. కిందటేడాది డిసెంబర్‌లో ఏకంగా 41 కోట్ల యూపీఐ ట్రాన్సాక్షన్లు పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్) ద్వారా జరిగాయి. పీపీబీఎల్‌లో వన్97 కమ్యూనికేషన్స్ (ఓసీఎల్) (పేటీఎం పేరెంట్ కంపెనీ) కు 49 శాతం వాటా ఉంది. ఈ కంపెనీని సబ్సిడరీగా కాకుండా అసోసియేట్ కంపెనీగా వన్97 కమ్యూనికేషన్స్ చూస్తోంది. 'పేమెంట్ కంపెనీగా ఓసీఎల్ వివిధ బ్యాంకులతో కలిసి పనిచేస్తోంది. ఇతర బ్యాంకులతో కలిసి పని చేయడం స్టార్ట్ చేశాం. ఇతర బ్యాంక్ పార్టనర్లకు మారడాన్ని వేగవంతం చేస్తాం' అని తెలిపింది.